సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



సాహితీవేత్త.. సంఘసంస్కర్త

తరిగొండ శ్రీ వెంగమాంబ ఓ సాహితీ వేత్త గానే కాకుండా అప్పటి సాంఘిక దురాచారాలను ధైర్యంగా ఎదిరించిన ధీరవనితగా నిలిచింది. -IIలో..



అందినకాడికి దోచుకున్నారు..!

తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం మండల పరిధిలోని నాలుగు గ్రామసమాఖ్యల పరిధిలో మాత్రమే రూ.20.31 లక్షలు స్వాహా అయినట్టు లెక్క తేలింది. -IIలో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.220	రూ.280
రెండోరకం	రూ.140	రూ.210

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 283 మెట్రిక్ టన్నులు



పేదలకు పట్టాభిషేకం



పట్టాల పంపిణీకి భూములు సిద్ధం

- ప్రభుత్వ భూమి సాగు చేసే వారికి సర్వ హక్కులు
- అన్నమయ్య జిల్లాలో 2435 మంది రైతుల గుర్తింపు
- 3276.06 ఎకరాల పంపిణీకి లబ్ధిదారుల ఎంపిక

రాయచోటి: సుదీర్ఘకాలంగా ప్రభుత్వ భూమి సాగు చేసుకుంటున్నా... హక్కులు రాని వారికి ప్రభుత్వం శుభవార్త తెలిపింది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూమిలో దుక్కులు చేసి పంటలు సాగు చేస్తున్న రైతులను గుర్తించి వారికి డి.పట్టాలు అందించే బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆర్థికంగా అన్నదాతలు పైచేయి సాధించేలా అసైన్డ్ భూముల సమస్యను పరిష్కరించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. ఈ మేరకు అధికార యంత్రాంగం ఇప్పటికే అర్హుల జాబితా రూపొందించింది.

ప్రభుత్వ భూమి గుర్తింపు

అన్నమయ్య జిల్లాలో 2435 మంది రైతులు 3276.04 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. వీరి వివరాలను పరిశీలించి సదరు భూమికి పట్టాలు అందజేసేందుకు తొలిసారి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అధ్యక్షతన అసైన్డ్ కమిటీ సమావేశం నిర్వహించారు. మంత్రి సూచనతో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో సిబ్బంది ప్రతి గ్రామంలో పర్యటించి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూమి సాగుచేస్తున్న వారి జాబితా రూపొందించారు. గత జూన్‌లో తొలి విడతగా గుర్తించిన అధికారులు అసైన్ కమిటీ ఆమోదంతో ప్రభుత్వానికి నివేదిక పంపారు. రెండో విడతగా మళ్లీ కొందరు రైతులను గుర్తించారు. ఆమోద ముద్ర పడగానే పేదలకు 1.5 నుంచి 2 ఎకరాల వరకు డి.పట్టాలు అందించనున్నారు.

నియోజకవర్గం వారీగా పట్టాల పంపిణీకి ప్రతిపాదించిన సాగు భూమి జాబితా

నియోజకవర్గం	రైతులు	భూమి (ఎకరాల్లో)
రాయచోటి	1297	1572.92
రైల్వేకోడూరు	197	271.08
రాజంపేట	846	1326.83
తంబళ్లపల్లె	82	88.61
మదనపల్లె	2	5.16
పీలేరు	11	11.44

ఇవీ అర్హతలు

- సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమి మినహా రైతులకు ఇతర పట్టా భూమి ఉండరాదు.
- సాగు చేసుకుంటున్న భూమిపై ఇతరులకు డీ పట్టా ఇచ్చి ఉండరాదు.
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో జరిగే అసైన్‌మెంట్ కమిటీలో ఆమోదం పొందాలి.

పారదర్శకంగా అర్హుల ఎంపిక



ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్న రైతులను గుర్తించాం. అర్హుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాం. వివరాలను ఆసైన్డ్ కమిటీ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదించాం. ఎక్కడా అవకతవకలకు తావు లేకుండా నిరుపేదలైన అర్హులకు అందజేస్తున్నాం. జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన పేదలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రభుత్వం ఆమోదం పొందగానే డీ-పట్టాల పంపిణీకి చర్యలు తీసుకుంటాం. తొలి, రెండో విడతలో అర్హులకు అందించేలా చర్యలు చేపడతాం.

– పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్

భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాలోని జాతీయ రహదారుల భూసేకరణ అంశంపై ఆర్డీఓలు, తహసీల్దార్లతో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నిర్మిస్తున్న నాలుగు లైన్ల జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. ఇప్పటి వరకు ఎంత భూసేకరణ జరిగింది.. ఎంత జరగాల్సి ఉంది.. పరిహారం చెల్లింపు, డ్రాఫ్ట్ నోటిఫికేషన్ల జారీ తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. పెండింగ్ ఫైల్స్ పరిష్కారాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆర్డీఓలకు సూచించారు. జిల్లాలోని రాజంపేట, నందలూరు, పుల్లంపేట, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లెలలో మండలాల వారీగా ఎన్ని ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయి.. ఎంత చెల్లింపులు చేయాల్సి ఉందన్న అంశాల గురించి ఆయా తహసీల్దార్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీరికి సంబంధించిన చెల్లింపులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. భూములకు సంబంధించి కోర్టులో కేసులు ఉంటే ఆయా సర్వే నెంబర్లకు సంబంధించి డబ్బు కోర్టులో డిపాజిట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లి, రాజంపేట ఆర్డీఓలు రంగస్వామి, మురళి, రామకృష్ణారెడ్డి, ఎన్‌హెచ్ ఏఐ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మంచి విద్యనందించాలి

విద్యార్థులకు మంచి విద్యాబోధన అందించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధ్యాపకులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ఒప్పంద డిగ్రీ అధ్యాపకుల సర్వీస్ రెన్యువల్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 46 మంది ఒప్పంద డిగ్రీ అధ్యాపకులు పనిచేస్తున్నారన్నారు. వీరందరూ మంచి విద్య బోధన చేసి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలన్నారు.అనంతరం కలెక్టర్ అధ్యాపకుల పనితీరును, ఫలితాలను సమీక్షించి 46 మందికి ఒప్పంద డిగ్రీ అధ్యాపకుల సర్వీస్‌ను 2023-24 విద్యా సంవత్సరానికిగాను రెన్యువల్ చేశారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఐడీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం సుధాకర్ రెడ్డి, అన్నమయ్య జిల్లాలోని తొమ్మిది ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్, ఒప్పంద అధ్యాపకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి: అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిని నియమిస్తూ గురువారం విజయవాడలోని కేంద్ర పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రెండో పర్యాయం జిల్లా అధ్యక్షుడిగా గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేరును ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా రాజంపేటకు చెందిన నల్లబోతుల ఈశ్వరయ్య, తంబళ్లపల్లికి చెందిన మాలిక్‌ను ఎంపిక చేశారు. జిల్లా సెక్రటరీలుగా పీలేరుకు చెందిన అశోక్‌రెడ్డి, మదనపల్లెకు చెందిన శ్రీనివాసులురెడ్డి, నాగభూషణ్‌రెడ్డిలను నియమించారు. కోశాధికారిగా రాయచోటి నుంచి ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డిని ఎంపిక చేశారు. వీరితో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులను 31 మందిని కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులో పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



సజ్జల రామకృష్ణారెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతికార్యకర్త సైనికుడిలా ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులతో కలిసి ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు పార్టీని మరింత బలోపేతం చేసి భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆయనతో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, రాష్ట్ర టూరిజం డైరెక్టర్లు సాయికిషోర్ రెడ్డి, మండల నాగేంద్ర, ఉప సర్పంచ్ తోట శివసాయి తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్ చరిత..
మనోళ్ల ఘనత



అన్నమయ్య జిల్లాకు చెందిన ఇద్దరు శాస్త్రవేత్తలు కీలక పాత్ర

గుర్రంకొండ : చంద్రయాన్ -3 విజయవంతం కావడంతో భారతీయులంతా ఆనంద భరితమైన క్షణాలను ఆస్వాదించారు. శాస్త్రవేత్తల మేధస్సును ప్రపంచమంతా కొనియాడుతోంది. అలాంటి శాస్త్రవేత్తలలో మనోళ్లు ఉండటం మనకు గర్వకారణం. అన్నమయ్య జిల్లాకు చెందిన ఇద్దరు ఈ ప్రయోగంలో కీలక పాత్ర పోషించడం విశేషం. గుర్రంకొండ మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన శాస్త్రవేత్త టి.వెంకటరమణారెడ్డి.. చంద్రయాన్ సాలిడ్ బూస్టర్స్ రాకెట్ల యంత్రాలు తయారు చేసే యూనిట్‌కు చీఫ్ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయన మదనపల్లె బీటీ కళాశాలలో డిగ్రీ, తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. 32 ఏళ్ల క్రితం ఇస్రోలో సైంటిస్ట్‌గా బాధ్యతలు స్వీకరించారు. అక్కడే పని చేస్తూ అంచెలంచెలుగా ఎదిగారు. చంద్రయాన్-3 తయారీ కోసం ఇస్రోలో సైంటిస్టులు కొన్నేళ్లుగా పని చేస్తున్నారు. ముందుగా చంద్రయాన్-3 రాకెట్‌ను గగనతలంలోకి పంపించే యంత్రాలను అక్కడ తయారు చేశారు. అక్కడి యంత్రాలు తయారు చేసే డివిజన్(యూనిట్)కు వెంకటరమణారెడ్డిని చీఫ్ జనరల్ మేనేజర్‌గా నియమించారు. సాలిడ్ బూస్టర్ రాకెట్ లో ఇంధనం నింపే ఎల్‌వీఎమ్-3 యంత్రాలను తయారీ చేసే ప్రక్రియలో కీలక పాత్ర పోషించారు. రాకెట్‌ను మొదటగా గగనతలంలోకి పంపించే యంత్రాల తయారీ విభాగానికి చీఫ్‌గా వ్యవహరించడం విశేషం. చంద్రయాన్-3 విజయవంతం కావడంలో తన వంతు పాత్ర పోషించిన వెంకటమణారెడ్డి తమ గ్రామానికి చెందిన వ్యక్తి కావడంతో ఎల్లుట్ల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చంద్రయాన్-3 విజయవంతం తరువాత ఇస్రో డైరెక్టర్‌తో కలసి ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న వెంకటరమణారెడ్డి



ఇస్రో చైర్మన్‌తో వస్తున్న గోపికృష్ణ

ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో అధిపతిగా..

పెనగలూరు : చంద్రయాన్ -3 ప్రయోగంలో పెనగలూరు గ్రామానికి చెందిన పమిడి కాల్వ సుబ్బనరసయ్య (రిటైర్డ్ తెలుగు పండిట్) పుత్రుడు గోపికృష్ణ ఉన్నారు. ఈయన శ్రీహరికోటలోని సతీష్ ధావన్ కేంద్రంలో గ్రూపు డైరెక్టర్‌గా పని చేస్తూ.. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో అధిపతిగా ఉన్నారు. ఈ రాకెట్ ప్రయోగానికి ఉపయోగించే రెండో లాంచ్ ప్యాడ్ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించారు. దీంతో ఆయన స్నేహితులు, బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్
- 19,003 మంది లబ్ధిదారులకు రూ.6.98 కోట్లు విడుదల



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, తదితరులు

రాయచోటి: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. అర్హులై ఉండి పలు కారణాలతో సంక్షేమ పథకాల లబ్ధి పొందలేకపోయిన వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసే 'బై యాన్యువల్ శాంక్షన్' కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీసీ ద్వారా బటన్ నొక్కి ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టర్ కార్యాలయంలోని విడియో కాన్ఫరెన్స్ భవనంలో పురపాలక సంఘం చైర్మన్ ఫయాజ్ బాషా, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, లబ్ధిదారులతో జరిగిన కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ అర్హులందరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం లబ్దిదారులకు మెగా చెక్కు, 7249 మందికి రేషన్, 1588 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు, 12,794 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు.

- అన్నమయ్య జిల్లాలో వివిధ పథకాల కింద 19,003 మంది లబ్ధిదారులకు రూ.6.98 కోట్లు అందిచినట్లు జేసీ తెలిపారు. వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా 20 మంది లబ్ధిదారులకు రూ.4.80 లక్షలు, వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద 383 మందికి రూ. 57.45 లక్షలు, జగనన్న చేదోడు కింద 1123 మందికి రూ. 112.30 లక్షలు, జగనన్న అమ్మఒడి కింద 622 మందికి రూ. 93.30 లక్షలు, వైఎస్సార్ ఆసరా కింద 50 మందికి రూ. 15.18 లక్షలు, జగనన్న విద్యా దీవెన కింద 2002 మందికి రూ. 248.14 లక్షలు, జగనన్న వసతి దీవెన కింద 1734 మందికి రూ. 152.44 లక్షలు, వైఎసార్ ఫ్రీ క్రాప్ ఇన్సూరెన్సు ద్వారా 275 మందికి రూ. 15.01 లక్షలు వంతున లబ్ధి చేకూరిందన్నారు.

రేషన్ కార్డు లేక ఇబ్బంది పడ్డాను



రేషన్ కార్డు లేక ఎన్నో ఇబ్బందులు పడ్డాను. ఇప్పుడు నాకు రేషన్ కార్డు మంజూరు కావడం ఎంతో సంతోషంగా ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి పదికాలాలపాటు ఉండాలని కోరుకుంటున్నాం.

– బి.కాంతమ్మ, రాయచోటి మండలం

పేద కుటుంబాల్లో వెలుగులు



అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్య లాంటి పథకాలను ప్రవేశపెట్టి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద కుటుంబాలలో వెలుగులు నింపుతున్నారు. కుల, మత, వర్గాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. మా అబ్బాయికి అమ్మఒడి ద్వారా డబ్బులు వచ్చాయి. ఇలాంటి పథకాలు ఇలాగే కొనసాగించాలి.

–ఎస్.సుల్తానా, సుండుపల్లె మండలం

జగనన్న ఇల్లు మంజూరు చేశారు



ఆరోగ్యశ్రీ కార్డు మంజూరు కావడం సంతోషంగా ఉంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాకు నాకు ఇల్లు మంజూరు చేశారు. నా కుటుంబంలో అమ్మకు పింఛను ఇస్తున్నారు. నా కుమారుడికి ఏటా అమ్మఒడి డబ్బులు వస్తున్నాయి., ఈ ప్రభుత్వంలో మా కుటుంబం సంతోషంగా ఉంది. ఇలాంటి ముఖ్యమంత్రిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలి.

– రఫీ ఉల్లా, లక్కిరెడ్డిపల్లి మండలం

కోర్టులో లొంగిపోయిన ఆడిటర్ శ్రీనాథ్

మదనపల్లె : టీడీఎస్ క్లెయిమ్‌లతో ఆదాయపు పన్ను శాఖను బురిడీ కొట్టించిన ఆడిటర్ శ్రీనాథ్ కోర్టులో లొంగిపోయిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. అన్నమయ్య జిల్లా మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లో రీఫండ్‌ను స్వాహా చేసిన కుంభకోణంలో ఈయనను పోలీసులు ప్రధాన నిందితుడుగా చేర్చారు. ఇదే కేసులో ఇప్పటి వరకు మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరులో ట్రెజరీ అధికారులుగా పనిచేసిన కె.శ్రీనివాసులు, ఎం.బాలమురళీ, ఎస్.ఇంతియాజ్‌లు, పుంగనూరు సబ్ ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న జి.వి.జీవానందంలను పోలీసులు అరెస్ట్ చేశారు.

రూ.13.21 కోట్లు స్వాహా చేశారని ఫిర్యాదు

రీఫండ్ పేరుతో నకిలీ టీడీఎస్ క్లెయిమ్‌లతో ఆదాయపన్ను శాఖకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ ఖజానాను ఆడిటర్ శ్రీనాథ్ మోసం చేశాడని తిరుపతికి చెందిన ఆదాయపు పన్ను శాఖ అధికారి ఎస్.రాజశేఖర్ ఫిర్యాదు మేరకు గత ఏడాది అక్టోబరులో కేసు నమోదైంది. రూ.37.62 కోట్లు ఫైల్‌చేసి అందులో నుంచి రూ.13.21 కోట్లు రీఫండ్ చేసి, ఆ డబ్బు అందరూ పంచుకుని ప్రభుత్వాన్ని మోసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 21న ఆడిటర్ శ్రీనాథ్ కోర్టులో లొంగిపోయినట్లు తెలిసింది. భర్త శ్రీనాథ్ జైలులో ఉండగా ఆయన భార్య రమ్య కోర్టు నుంచి బెయిలు తీసుకున్నట్లు సమాచారం. దీనిపై డీఎస్పీ కేశప్పను వివరణ కోరితే... ఆడిటర్ శ్రీనాథ్ మదనపల్లె కోర్టులో లొంగిపోయాడని, తాము అరెస్ట్ చేయలేదన్నారు.

నేడు పాఠశాలలకు ఐచ్ఛిక సెలవు

రాయచోటి టౌన్: నేడు వరలక్ష్మి పండుగ సందర్భంగా ఐచ్చిక సెలవు ఉపయోగించుటకు అనుమతి ఇస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరాం పురుషోత్తం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్య పాఠశాలలకు ఇది వర్తిస్తుందన్నారు.

న్యూస్‌రీల్

ఆర్టీసీ విద్యుత్ బస్సు చార్జీలు తగ్గింపు

మదనపల్లె సిటీ: ఆర్టీసీ విద్యుత్ బస్సు చార్జీలు తగ్గించినట్లు తిరుపతి ప్రజా రవాణా అధికారి భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి-మదనపల్లెకు ప్రస్తుతం రూ.300 ఉండగా రూ.40 తగ్గించామన్నారు. తిరుపతి-కడపకు ప్రసుత్తం రూ.340 ఉండగా రూ.50 తగ్గించామని, తిరుపతి-నెల్లూరుకు ప్రస్తుతం రూ.350 ఉండగా రూ.50 తగ్గించామన్నారు. తగ్గిన చార్జీలు ఈనెల 26 నుంచి అమల్లోకి వస్తాయన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

విద్యాదీవెన, వసతి దీవెన కోసం రెన్యువల్ చేసుకోండి

రాయచోటిటౌన్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన కోసం 2023-2024 సంవత్సరానికి సంబంధించి /జ్ఞానభూమి పోర్టల్‌లో రెన్యువల్ చేసుకోవాలని అన్నమయ్య జిల్లా సంక్షేమశాఖ సాధికారిత అధికారి జాకీర్ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యం వారు వారి లాగిన్‌లో అప్లోడ్ చేసుకోవాలని సూచించారు. రెన్యువల్ రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబర్ 10 వరకు గడువు ఉందన్నారు.

ఈకెవైసీ చేయించుకోండి

రాయచోటిటౌన్ : అర్హత ఉన్న విద్యార్థులు జగనన్న విద్యాదీవెన కోసం ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలని అన్నమయ్య జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమశాఖ సాధికారిత అధికారి జాకీర్ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఈనెల 28వ తేదీ జగనన్న విద్యాదీవెన పథకం త్రైమాసిక నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. జగనన్న విద్యా దీవెనకు సంబంధించి ఆయా గ్రామ సచివాలయాల్లో సోషియల్ ఆడిట్ నిర్వహిస్తున్నారని, దీనికి సంబంధించి వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులకు లాగిన్ ఆప్షన్ ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థి తమ తల్లి ఆధార్ నంబర్, బ్యాంక్ నంబర్ సంబధిత బ్యాంక్‌లో లింక్ చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆశా కార్యకర్తలకు శిక్షణ



సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఎంఓ లోకవర్ధన్

చిన్నమండెం : ఆరోగ్య సేవలను ఆశా కార్యకర్తలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని డీపీఎంఓ అధికారి డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. చిన్నమండెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీపీఎంఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ట్యాబ్‌లు ఇచ్చిందని, వాటి ద్వారా 1000 జనాభాను మ్యాప్ చేసి వారికి అందించే సేవలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇందుకోసం ఆశాలకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో సీహెచ్‌ఓ(ఎంఎల్‌హెచ్‌పీ)లు అందుబాటులో ఉంటూ 105 రకాల మందులు, 14 రకాల పరీక్షలు ఉచితంగా ప్రజలకు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ, ఎల్‌టీ రాము, ఆరోగ్య పర్యవేక్షకులు చంద్రకళ, స్టాఫ్ నర్సులు శోభారాణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం



రైతులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వెంకటసుబ్బయ్య

బద్వేలు అర్బన్: సాగులో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడం, నాణ్యమైన దిగుబడులను సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందని ఉమ్మడి వైఎస్సార్ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ హెచ్.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. ప్రధానమంత్రి అనుసూచిత్ జాతీయ అభ్యుదయ యోజన ద్వారా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూలు కులాల రైతులకు గురువారం వైఎస్సార్ జిల్లా బద్వేలు మార్కెట్‌యార్డు ఆవరణలో కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలు విలువ చేసే మెటీరియల్, 23 రకాల విత్తనాలు అందిస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈఓ కుముద, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, ప్రకృతి వ్యవసాయ జిల్లా యాంకర్ నాగసుబ్బరాయుడు, ఎన్‌జీవో మునెయ్య, రైతులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ

గాలివీడు : మండల కేంద్రంలోని నూలివీడు మార్గం నల్లగుట్ట వద్ద గల జగనన్న కాలనీలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. సమాచారం అందుకున్న తహసీల్దార్ దైవదీనం, ఆర్ఐ బాలాజీ, వీఆర్ఓ రవీంద్రారెడ్డి, పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. రెవెన్యూ అధికారుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గతంలో ప్రభుత్వ భూమిలో మామిడి మొక్కలను నాటి ఆక్రమించిన ప్రభుత్వ స్థలాన్ని వెనక్కు తీసుకున్న రెవెన్యూ యంత్రాంగం జగనన్న కాలనీ నిమిత్తం లే ఔట్లు వేసింది. ఇంటి నిర్మాణాల కోసం లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేసింది. అయితే ఆ భూమిని ఆక్రమించిన వ్యక్తి అధికారుల ఆదేశాలను బేఖాతారు చేశాడు. లబ్ధిదారులకు ఇచ్చిన భూమిని చదును చేసి ఆక్రమించుకునేందుకు ప్రయత్నించాడు. లబ్ధిదారులు ఎదురు తిరగడంతో ఆక్రమణదారుడు కొడవలితో వారిపై దాడికి ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన రెవెన్యూ యంత్రాంగం పోలీసులతో కలిసి అక్కడికి వెళ్లారు. ఆక్రమణ భూమిని ఖాళీ చేయించి లబ్ధిదారులకు అప్పజెప్పారు. ఇదే క్రమంలో రెండు వర్గాల మధ్య జరిగిన గొడవలో లబ్ధిదారులైన ఓ మహిళకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హత్య కేసులో ఐదుగురికి యావజ్జీవ శిక్ష

ప్రొద్దుటూరు క్రైం/దువ్వూరు : దువ్వూరులో 2012లో స్థల వివాద విషయమై జరిగిన నేలటూరి బాలరంగన్న హత్య కేసులో ప్రొద్దుటూరు కోర్టు ఐదుగురికి యావజ్జీవ శిక్షను విధించింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బాలరంగన్న, బుచ్చిరంగడు కుటుంబాల మధ్య 10 ఏళ్ల నుంచి 15 సెంట్ల స్థల విషయమై వివాదం నడుస్తుండేది. ఈ క్రమంలో 2012 మార్చి 25న రాత్రి బాలరంగన్న కుమారుడు లక్ష్మీరంగడు ఇంటికి వెళ్తున్న సమయంలో బుచ్చిరంగడుతోపాటు కొందరు వ్యక్తులు అతనిపై దాడి చేశారు. ఇంటికి వెళ్లిన అతను ఈ విషయాన్ని బాలరంగన్నకు తెలిపాడు. దీంతో బాలరంగన్న సోదరులతో కలిసి బుచ్చిరంగడు ఇంటి వద్దకు వెళ్లాడు. అక్కడ వారి మధ్య మాటకు మాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో బుచ్చిరంగడుతోపాటు మరి కొందరు వ్యక్తులు కట్టెతో తలపై కొట్టడంతో బాలరంగన్నకు తీవ్ర రక్తస్రావమైంది. దీంతో అతన్ని వెంటనే చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యుడు అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు రంగనాథ్ ఫిర్యాదు మేరకు దువ్వూరు పోలీసులు క్రైం నంబర్ 44/12 కింద హత్య కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా నేలటూరి బుచ్చిరంగడు, నేలటూరి రంగస్వామి, చంద్రకస్తూరి, చిలమకూరి ఆంజనేయులు, చిలమకూరి సుబ్బులక్షుమ్మ, చిలమకూరి పాలగండి, చిలంకూరి వెంకటసుబ్బయ్యలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ ప్రొద్దుటూరులోని సెకండ్ ఏడీజే కోర్టులో కొనసాగుతూ వచ్చింది. కేసు విచారణలో భాగంగా నేరం రుజువు కావడంతో సెకండ్ ఏడీజే జడ్జి జీఎస్ రమేష్‌కుమార్ ఐదుగురికి యావజ్జీవ శిక్షతోపాటు రూ.2.30 లక్షలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించారు. చంద్రకస్తూరికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధించారు.

సాహితీవేత్త.. సంఘసంస్కర్త

- భక్త కవయిత్రిగా వెంగమాంబ
- శ్రీ వెంకటేశ్వరుడ్ని భర్తగా కొలచిన మహాసాధ్వి
- నేడు తరిగొండలో జయంతి ఉత్సవాలు


వెంగమాంబ విగ్రహం


తరిగొండలోని వెంగమాంబ ఆలయం

గుర్రంకొండ : తిరుమలలోని శ్రీవారి సన్నిధిలో అన్నమయ్య మేలుకొలుపు- వెంగమాంబ జోల పాట, ముత్యాలహారతి అనే నానుడి భక్తుల్లో నాటుకుపోయింది. తెలుగుచరిత్రలో తొలి తెలుగు కవయిత్రి తరిగొండ శ్రీ వెంగమాంబ. ఆమె ప్రపంచానికి ఓ సాహితీ వేత్తగానే కాకుండా అప్పటి సాంఘిక దురాచారాలు, సనాతన ధర్మాలను ధైర్యంగా ఎదిరించిన ధీరవనితగా నిలిచింది. చరిత్రలో రాజరామ్‌మోహన్‌రాయ్, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి సాంఘిక సంస్కర్తల కంటే మునుపే అప్పట్లో సాంఘిక దురాచారాలను దీటుగా ఎదుర్కొంది. తరిగొండలో శుక్రవారం వెంగమాంబ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు.

17వ శతాబ్దంలో జననం

క్రీ.శ 17వ శతాబ్దంలో అప్పటి చిత్తూరు జిల్లా గుర్రంకొండ మండలంలోని తరిగొండలో నియోగి బ్రాహ్మణ కుటుంబానికి చెందిన కానాడ కృష్ణమూర్తి, అచ్చమాంబ దంపతులకు వెంగమాంబ జన్మించింది. ప్రస్తుతం గుర్రంకొండ మండలం అన్నమయ్య జిల్లా పరిధిలోకి వచ్చిన విషయం తెలిసిందే. వెంగమాంబ బాల్యం నుంచే తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామిని తన భర్తగా భావించి నిరంతరం అద్వితీయమైన ధ్యానముద్రలో గడిపేది.

ఎన్నో రచనలకు శ్రీకారం

శ్రీ వెంకటేశ్వరస్వామిపై అనురక్తితో వెంగమాంబ అనేక రచనలకు శ్రీకారం చుట్టారు. తరిగొండలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామిని స్మరిస్తూ శ్రీ నరసింహ శతకాన్ని రచించింది. దీనికి నిదర్శనంగా ఇప్పటికీ తరిగొండలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోనే శ్రీ వెంగమాంబ ఆలయం కూడా ఉంది. శ్రీకృష్ణపారిజాతం, ముక్తకాంతావిలాసం, శ్రీ ముద్రరామాయణ ద్విపద కావ్యాలను రచించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మీద సుమారు రెండు వేల కీర్తనలను ఆ కాలంలో తాళ పత్రాలపై రచించింది. ఈ తాళపత్రాలు నేటికీ తిరుపతిలో టీటీడీ ఆధీనంలో ఉన్నాయి.

సాంఘిక దురాచాలను ధిక్కరించిన ధీరవనిత

క్రీ.శ 17,18 శతాబ్దాల్లో అప్పటి సమాజంలో సాంఘిక దురాచాలను కట్టుదిట్టంగా అమలు చేసేవారు. తిరుపతికి సమీపంలోని భాకరాపేటకు చెందిన ఇంజేటి వెంకటాచలపతితో వెంగమాంబ వివాహం జరిపించారు. అయితే దురదృష్టవశాత్తు భర్త ఆమె చిన్నతనంలోనే గతించారు. బ్రాహ్మణ సమాజంలో సనాతన సంప్రదాయాలు ఎక్కువగా పాటించే కాలం. బ్రాహ్మణ స్త్రీకి భర్త మరణిస్తే శిరోముండనం చేయించి బొట్టు, గాజు, మెట్టలు తొలగించి ఇంటిలోనే ఉంచేవారు. అయితే శ్రీనివాసుడ్నే తన భర్తగా భావించిన వెంగమాంబ ఈ సంప్రదాయలను తిరస్కరించింది. ఈమె ధోరణిని నిరసిస్తూ బ్రాహ్మణులంతా పుష్పగిరి అప్పటి పీఠాధిపతి విద్యానృసింహ భారతికి ఫిర్యాదు చేశారు.

గురుపీఠం దగ్ధం- శిరోజాలు యథాతథం

పుష్పగిరి పీఠాధిపతి తరిగొండకు చేరుకొని వెంగమాంబకు హితబోధ చేశారు. ఆమె తిర్కరించడంతో అపరాధంగా భావించిన పెద్దలు పీఠాధిపతికి సాష్టాంగ నమస్కారం చేసి తప్పు సరిదిద్దుకోవాలని ఆదేశించారు. అయితే వెంగమాంబ పీఠాధిపతికి బదులుగా గురుపీఠానికి నమస్కారం చేయడంతో గురుపీఠం దగ్ధమైంది. ఆగ్రహించిన పెద్దలు ఆమెకు బలవంతంగా శిరోముండనం చేయించి తరిగొండ నరసింహస్వామి కొలనులో స్నానం చేయించారు. స్నానం చేసిన తరువాత వెంగమాంబ తలపై శిరోజాలు మునపటి లాగే దర్శనమిచ్చాయి. దీంతో వెంగమాంబకు గ్రామ బహిష్కారం విధించారు.

ఆంజనేయస్వామి గుహ నుంచే తిరుమలకు..

బ్రాహ్మణ పెద్దల ప్రవర్తనతో మనస్తాపం చెందిన వెంగమాంబకు శ్రీనివాసుడు తన వద్దకు చేరుకోవాలని సూచించి తిరుమలకు మార్గం కూడా చూపించారు. ప్రస్తుతం తరిగొండలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం వెనకవైపు ఉన్న సొరంగ మార్గం ద్వారా ఆమె తిరుమలకు చేరుకొంది. అక్కడ తుంబుర తీర్థంలోని శ్రీ వెంగమాంబ గుహగా పిలువబడే పర్వతశ్రేణిలో తన సాధనను కొనసాగించింది. అక్కడే కొన్ని రచనలు, కీర్తనలు రచించింది.

ముత్యాలహారతి.. వెంకటేశ్వరుడికి జోలపాట

తిరుమలలోనూ బ్రాహ్మణుల నుంచి ఆమెకు కష్టాలు ఎదురయ్యాయి. ఒకరోజు వెంగమాంబ గుహలో శ్రీనివాసుడు ప్రత్యక్షమై, అంతర్ధానం కావడం బ్రాహ్మణులు వీక్షించి వెంగమాంబ మహత్యాన్ని తెలుసుకొని తమ తప్పులు క్షమించాలని వేడుకొన్నారు. అప్పటి నుంచి కొండపైన అన్నమయ్య వారసులకు కల్పించిన సౌకర్యాలను ఈమెకు కల్పించారు. ఉండడానికి నివాసం, ఇతర సౌకర్యాలతోపాటు ఆలయంలో ఉదయం అన్నమయ్య మేలుకొలుపు తరువాత రాత్రి స్వామివారి జోలపాట ముత్యాలహారతి ఇచ్చే భాగ్యాన్ని వెంగమాంబకు కల్పించారు. అప్పటి నుంచి ఆమె తరువాత ఆమె వంశీకులు నేటికీ ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

నిత్యాన్నదానానికి శ్రీకారం

తిరుమలలో నేటికీ కొనసాగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది తరిగొండ శ్రీ వెంగమాంబే. క్రీ.శ 1812-15 మధ్య కాలంలో తిరుమలకు వచ్చే భక్తులకు వెంగమాంబ తన నివాసంలోనే భోజనాలు తయారు చేసి వడ్డించడం ప్రారంభించింది. వందలాది మంది భక్తుల ఆకలిని ప్రతి రోజూ తీర్చేది. టీటీడీ వారు నేటికీ ఆ సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. ఇందుకు నిదర్శనంగా స్వామి వారి ఆలయానికి సమీపంలో ఉన్న నిత్యాన్నదాన సత్రానికి శ్రీ వెంగమాంబ పేరు పెట్టడం గమనార్హం

జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు

మండలంలోని తరిగొండ ఆలయంతోపాటు తిరుమలలో శ్రీ వెంగమాంబ జయంతి ఉత్సవాలు జరుగుతాయి. తిరుమలలో గురువారం, తరిగొండలో మరుసటి రోజు నిర్వహించడం ఆనవాయిగా వస్తోంది. తరిగొండలోని వెంగమాంబ ఆలయంలో శుక్రవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక కార్యక్రమాలు, అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. సాయంకాలం కల్యాణోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. తిరుపతి శ్రీ వెంగమాంబ ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ముస్లిం మతపెద్ద మురాషావలీ ఆశ్రయం

గ్రామ బహిష్కారానికి గురైన శ్రీ వెంగమాంబకు తరిగొండలో అప్పటి గొప్ప సూఫీమత బోధకుడు ముస్లీం మతగురువైన హజరత్ సయ్యద్ మురాద్‌షావలీ ఆశ్రయం కల్పించారు. కొద్ది రోజుల పాటు ఆయన వద్దనే గడిపింది. తరిగొండలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి సమీపంలోనే ఈ మురాద్‌వలీ దర్గా (సమాధి) ఉంది. ఏటా ఇక్కడ వెంగమాంబ ఉత్సవాల కంటే మునుపే దర్గా ఉరుసు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం వెంగమాంబ తరిగొండకు సమీపంలోని మార్రెళ్ల గెవి(గుహ)కు చేరుకొంది. అయితే ప్రతి రోజు ఆమె సాధనకు అవసరమైన సాధనా సామగ్రి, కందమూలాను మురాద్‌షావలే సమకూర్చేవారు.


వెంగమాంబకు ఆశ్రయం కల్పించిన సయ్యద్ హజరత్ మురాద్‌షావలీ దర్గా

రుక్సానా హత్య కేసులో ప్రధాన నిందితురాలి అరెస్ట్


షేక్‌అయిషా అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ, సీఐ

మదనపల్లె : పట్టణంలో సంచలనం సృష్టించిన ప్రైవేట్ కాలేజీ అధ్యాపకురాలు రుక్సానా హత్య కేసులో ప్రధాన నిందితురాలు షేక్ అయిషా(26)ను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. గురువారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మురళీకృష్ణతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. మదనపల్లె టౌన్ శివాజీనగర్‌కు చెందిన ఎస్.కే.ఖాదర్‌అహ్మద్ కుమారుడైన ఖదీర్‌అహ్మద్‌తో షేక్ అయిషాకు 2020 మార్చి 22న వివాహం జరిగింది. అయితే అప్పటికే ఖదీర్‌అహ్మద్‌కు పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన మహమ్మద్‌అలీ కుమార్తె పఠాన్ రుక్సానాతో 2017లో పెళ్లి జరిగిందని, భర్త తనను మోసం చేసి పెళ్లి చేసుకోవడంలో మొదటి భార్య రుక్సానా సహకరించిందని ఇద్దరిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. దీంతో భర్త ఖదీర్‌అహ్మద్ రెండో భార్య షేక్‌అయిషాకు దూరంగా ఉండటంతో పుట్టింటిలో ఒంటరిగా ఉండేదన్నారు. తాను భర్తకు దూరమయ్యేందుకు మొదటి భార్య రుక్సానా కారణమని భావించిన అయిషా తన అన్న షేక్‌ప్యారేజాన్, తమ్ముడు షేక్‌సులేమాన్, భర్త ఖదీర్‌అహ్మద్, బావ షబ్బీర్, తమ్ముడి స్నేహితులు షేక్‌అహ్మద్, షేక్ అయాజ్‌అహ్మద్, షేక్ ఇమ్రాన్ అలియాస్ మౌలా, అన్న స్నేహితులు షేక్‌జాఫర్‌బాషా, షేక్‌షారుఖ్, మేనమామ షేక్‌దాదాపీర్, బంధువు ఇర్ఫత్ తంజమ్ బేగంతో కలిసి హత్య చేసేందుకు పథకం రచించారన్నారు. రుక్సానా కదలికలను పసిగట్టి పథకం ప్రకారం ఆగస్టు 3వ తేదీన సాయంత్రం 5.30 గంటల సమయంలో ప్రశాంత్‌నగర్ సిద్ధార్థ కాలేజీరోడ్డు రఫీ కారు మెకానిక్ గ్యారేజీ వద్ద ఆయేషా తమ్ముడు సులేమాన్, స్నేహితుడు షేక్‌అహ్మద్‌లు కాపుకాచి మెడపై కత్తితో పొడిచి చంపారన్నారు. కుటుంబంలో ఇద్దరు భార్యలు భర్త కోసం గొడవలు పడటంతో హత్య జరిగిందన్నారు. హత్యలో ప్రధాన నిందితురాలైన షేక్ అయిషా కర్ణాటకలోని చింతామణి అగ్రహారంలోని షేక్‌ఆరీఫ్ ఇంటిలో తలదాచుకుని ఉండగా, ప్రత్యేక బృందానికి వచ్చిన సమాచారం మేరకు అరెస్ట్ చేసి నేరంలో ఉపయోగించిన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో ప్రాథమికంగా 12 మంది నిందితులుగా నిర్ధారణకు వచ్చామని, 11 మందిని అరెస్ట్ చేశామన్నారు. బంధువు ఇర్ఫత్ తంజమ్‌బేగంను అరెస్ట్ చేయాల్సి ఉందని, త్వరలోనే ఆమెను అరెస్ట్ చేసి చార్జ్‌షీట్ వేస్తామన్నారు. రుక్సానా హత్యకేసు విచారణలో ఉండగా, కొందరు కావాలనే జోక్యం చేసుకుని పోలీసులపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల ప్రకారం రుక్సానా హత్యకేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని విచారణ చేస్తుంటే సంబంధం లేని వ్యక్తులు కేసును తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

గాయపడిన జింక మృతి

ములకలచెరువు : పీటీయం మండలం రంగసముద్రం వద్ద మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన కృష్ణ జింక గురువారం మృతి చెందినట్లు ఫారెస్టు బీటు అధికారి సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెటర్నరీ హాస్పిటల్‌లో జింకకు చికిత్స అందించి ములకలచెరువు సమీపంలోని దుసానివారిపల్లె వద్ద ఆడవిజంతువుల సంరక్షణ శిబిరంలో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. తీవ్రగాయాల కారణంగా జింక పరిస్థితి విషమించి మృతి చెందినట్లు చెప్పారు. పోస్టుమార్టం నిర్వహించి దగ్గరలోని కనుగొండ అడవిలో ఖననం చేసినట్లు వివరించారు.

బైక్‌ను ఢీకొన్న మినీ ఐచర్ వాహనం

– వ్యక్తి మృతి


ప్రభాకర్ (ఫైల్)

ఒంటిమిట్ట : మండల పరిధి మంటపంపల్లె గ్రామ సమీపంలోని కడప-చెన్నై జాతీయ రహదారిపై గురువారం బైక్‌ను మినీ ఐచర్ వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మైదుకూరు మండలం ఉప్పుగుంటపల్లి గ్రామానికి చెందిన జొన్నలగడ్డ ప్రభాకర్(45) నందలూరు మండలం కోనపురంలో ఉన్న తన పెద్ద కుమార్తె రేణుక వద్దకు బైక్‌పై బయలుదేరాడు. మంటపంపల్లె రైల్వేగేట్ సమీపాన ఉన్న జాతీయ రహదారి వద్దకు రాగానే రాజంపేట నుంచి కడప వైపు పోతున్న మినీ ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయం అయ్యింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు బాధితుడిని 108 వాహనం ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. ప్రభాకర్‌కి ఇద్దరు కుమార్తెలు. రేణుకను నందలూరు మండలం కోనపురంలోని వ్యక్తికి, రెండవ కుమార్తె అనితను రైల్వే కోడూరు వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. ప్రభాకర్ భార్య పేరు సుశీల. ఈమె ప్రస్తుతం కువైట్‌లో ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొత్తమాధవరంలో చోరీ


చోరీ జరిగిన ఇంటిలో పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కొత్తమాధవరం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తమాధవరం గ్రామంలోని బ్రాందీ షాపు సమీపాన ఉన్న ఓ వీధిలో వెంకట సుబ్బయ్య ఇంటిలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. రూ.30 వేల నగదు, దాదాపు మూడు తులాల బంగారం అపహరించారు. అలాగే అదే రోజు రాత్రి అదే వీధిలో వలంటీర్‌గా పని చేస్తున్న మహేష్ ఇంటి ముందు ఉన్న కిరాణా షాపులో నూనె ప్యాకెట్లు, గోధుమపిండి ప్యాకెట్లు ఎత్తుకెళ్లారు. అదే వీధిలో ఉన్న పులిచర్ల చిన్నగిరి ఇంటిలో చోరీ చేస్తుండగా శబ్దాలు రావడంతో.. పక్క ఇళ్లలో ఉన్న కాలనీ వాసులు అరుపులు, కేకలు వేయడంతో పరారీ అయ్యారు. దీనికి సంబంధించి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను పిలిపించిన పోలీసులు వేలిముద్రలు, ఆనవాళ్లను సేకరించారు.

అందినకాడికి దోచుకున్నారు..!

- నాలుగు గ్రామసమాఖ్యల్లో రూ.20.31 లక్షలు స్వాహా
- రుణాలు చెల్లించినా.. సంఘ మిత్రలు చేతివాటం
- విచారణ ఉందని రికార్డులనే మార్చేశారు
- పెద్దతిప్పసముద్రం మండలం మొత్తం విచారణ?


పెద్దతిప్పసముద్రం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం మండలంలో స్త్రీ నిధి, కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (సీఐఎఫ్) ద్వారా రుణాలు పొందిన మహిళా సంఘాల సభ్యులు సకాలంలో రుణ వాయిదాలను చెల్లించినా.. అవి బ్యాంకు ఖాతాలకు జమ కాకపోవడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ మండలంలో కేవలం నాలుగు గ్రామసమాఖ్యల పరిధిలో మాత్రమే విచారణ జరపగా రూ.20.31 లక్షలు స్వాహా చేసినట్టు వెలుగు చూసింది. దీనితో మండలం మొత్తం విచారణ చేస్తే ఇంకెన్ని లక్షల అక్రమాలు వెలుగుచూస్తాయో అన్న ప్రశ్న తలెత్తుతున్నది.

దోచుకుంది సంఘమిత్రలే

పెద్దతిప్పసముద్రం మండలంలో స్త్రీ నిధి, సీఐఎఫ్ రుణాలు తిరిగి వసూలు కాకపోవడంతో చెల్లింపులు స్వాహా జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు విచారణకు బృందాలను నియమించారు. రాపూరివాండ్లపల్లె, పీటీఎం-3, తుమ్మరకుంట, పులికల్లు గ్రామసమాఖ్యలకు ఒక్కో బృందాన్ని నియమించారు. ఈ బృందాలు వారంరోజులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. రుణాలు పొందిన మహిళా సంఘ సభ్యులను, సంఘమిత్రలను విచారణ చేశారు. సభ్యులు తాము తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించినట్టు, డబ్బు తీసుకున్న సంఘమిత్రలు బ్యాంకు ఖాతాలకు జమ చేయకుండా స్వాహా చేశారని విచారణలో తేలింది. విచారణ సందర్భంగా కొందరు సంఘమిత్రలు అతి తెలివి చేశారు. గతంలో పని చేసిన ఓ ఏపీఎం సలహాతో పాత రికార్డులను చింపేసి కొత్తగా మళ్లీ రికార్డులు రాసినట్టు తెలిసింది. పాత రికార్డులను పరిశీలిస్తే టీడీపీ హయాంలో జరిగిన అక్రమాలు పెద్దస్థాయిలో వెలుగులోకి వస్తాయని ఇలా చేసినట్టు తెలిసింది. ఈ రికార్డులను మార్చేసిన విషయం విచారణలో వెలుగుచూసింది. దీనిపై ప్రశ్నించిన ఓ అధికారికి కొందరు సంఘమిత్రలు సరైన సమాధానం ఇవ్వలేదని తెలిసింది.

రూ.20.31 లక్షలు స్వాహా

పెద్దతిప్పసముద్రం మండల పరిధిలోని నాలుగు గ్రామసమాఖ్యల పరిధిలో మాత్రమే రూ.20.31 లక్షలు స్వాహా అయినట్టు లెక్క తేలింది. అందిన సమాచారం మేరకు.. పీటీఎం-3 సమాఖ్యలో రూ.3.80 లక్షలు, పులికల్లు సమాఖ్యలో రూ.4.97 లక్షలు, రాపూరివాండ్లపల్లె సమాఖ్యలో రూ.5.50 లక్షలు, తుమ్మరకుంట సమాఖ్యలో రూ.6.04 లక్షలు స్వాహా చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సంఘమిత్రలు సభ్యులు చెల్లించిన రుణాలను తిరిగి బ్యాంకు ఖాతాలకు జమ చేయకుండా స్వాహా చేశారని విచారణ బృందాలు తేల్చాయి. దీనిపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. కాగా కేవలం నాలుగు సమాఖ్యల పరిధిలోనే ఈ స్థాయిలో అక్రమాలు వెలుగు చూడగా మండలం మొత్తం విచారణ జరిపితే ఇంకా ఏ స్థాయిలో బయటపడుతుందో అని అధికార వర్గాలే చర్చించుకొంటున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు మండలం మొత్తం విచారణ జరపాలని భావిస్తున్నట్టు తెలిసింది.

స్వాధీనం చేసుకున్న గంజాయి నిర్వీర్యం

సిద్దవటం : పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయిని సిద్దవటం మండలం ఏపీఎస్పీ 11వ బెటాలియన్ సమీపంలోని కొండ ప్రాంతంలో పోలీసులు గురువారం నిర్వీర్యం చేశారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు పట్టుకున్న గంజాయిని జిల్లా ఎస్పీ అన్బురాజన్ సమక్షంలో శాస్త్రీయ పద్ధతిలో దహనం చేశారు. కడప డీఎస్పీ షరీఫ్ ఆధ్వర్యంలో జిల్లా లోని పలువురు సీఐలు, ఎస్ఐలు కార్యక్రమంలో పాల్గొన్నారు.


గంజాయిని నిర్వీర్యం చేస్తున్న పోలీసులు